# వార్తా పత్రికల్లో అప్పుడప్పుడూ నిజాలు కూడా రాస్తుంటారు. అయితే - వార్తలన్నీ నిజాలు కానట్టే నిజాలన్నీ వార్తలు కూడా కావు

ఈ మధ్య మన వార్తా పత్రికల్లో దుర్వార్తలే ఎక్కువుంటున్నాయి. మనది అభివృద్ధి చెందుతున్న దేశమని గదండీ పెద్దలు చెబుతారు - అంచేత అనేక విషయాల్లో అభివృద్ధి అనేది సహజం ; అందుకే ధరలు పెరుగుతూం టాయి, నల్ల బజారు వ్యాపారం పెరుగుతూంటుంది, నిరుద్యోగం పెరుగుతుంది; ఆకలి పెరుగుతుంది; హత్యలూ, దొంగతనాలూ, దోపిడీలూ పెరుగుతాయి.



డి. వెంకట్రామయ్య

ఇవన్నీకాక, మనం ఇటీవల మానభంగాల విషయంలో కూడా గణనీయమైన అభివృద్ధి సాధించినట్టు, రోజూ అనేక దుర్వార్తలు చదివి తెలుసుకుంటున్నాం.

అయితే, ఈదుర్వార్తలన్నీ నిజాలుకావు : ఇవన్నీ కట్టుకథలు ; కొందరు స్వార్థపరులు స్వప్రయోజనాల కోసం ప్రచారం చేస్తున్న వదంతులు; రాజకీయ ప్రతిపక్షాలు ప్రభుత్వపక్షాన్ని అప్రతిష్ఠపాలు చెయ్యడానికి అల్లిన అబద్ధాలు- అంటూ, కొందరు నాయకులూ, పెద్దలూ కోప్పడుతున్నారు. మరికొందరేమో ఇవన్నీ అసలు సిసలు నిజాలనీ, వాస్తవాలనీ వాదిస్తున్నారు. ఇంకా కొంతమంది ఈ నిజానిజాల గొడవ పట్టించుకోకుండా అమితమైన "ఆసక్తితో ఈ దుర్వార్తలు చదువుతున్నారు పైకి చెప్పకపోయినా. సినిమాల్లో రేప్‌సీన్లు చూసి ఆనందించినట్టే ఇలాంటి వార్తలు చాలా వివరంగా చదివి ఆనందిస్తున్నారు.

వార్తలు ఆనందింపజేసేట్టుగా వుండాలని ఎవరూ అన్లేదుగాని- కథలూ, కవిత్వాలూ, నవలలూ ఇలాంటివాటికి-పాఠకుడి మనసు రంజింపచెయ్యడమొక్కటే పరమధర్మమని కూడా మన పెద్దలు చాలా కాలంగా చెప్తున్నారు కదండీ. అంచేత, ఇటీవల మన పత్రికల్లో వస్తున్న మానభంగాల వార్తలన్నీ విడవకుండా చదువుతూ, ఆనందిస్తూ, అలా చదవగా చదవగా వాటిలో ఆసక్తి తగ్గుతోందనీ, వైవిధ్యం కొరవడుతోందనీ, అన్నీ ఒకేలా వుంటున్నాయనీ విచారిస్తున్న పాఠక మహాశయుల మనసుల్ని రంజింపచేద్దామనే సదుద్దేశ్యంతోనూ, వారికి "వెరైటీ" చూపిద్దామనే సంకల్పంతోనూ, ముచ్చటగా మూడు "రేప్ స్టోరీస్" అందిస్తున్నాను అవధరించండి !

* * *

శ్రీరామచంద్రులవారు వనవాసం చేస్తున్నటువంటి కాలంలో- అందమైన ఆకుల్తోనూ, అనేక రకాల చెట్టుకొమ్మల్తోనూ కట్టుకుని, లతలతోనూ, పువ్వుల్తోనూ, రంగవల్లికలతోనూ అలంకరించుకున్నటువంటి పట కుటీరమున్నూ- నగరానికి ఏడున్నొక్క కిలోమీటర్ల ఎడంగా రామిగాడనే రిక్షావాడు- కిరసనాయిల్ చెక్కల్తోనూ, తుప్పట్టిన డబ్బారేకుల్తోనూ, చీకిపోయిన గోనె గుడ్డల్తోనూ కట్టుకున్న గుడిసెన్నూ ఒక్కటికావు; ఒకలా వుండవు. గుడిసెలెప్పుడూ అందంగా ఉండవు; వాటికి అలంకారాలుండవు. అవెప్పుడూ మురిగ్గానూ, అసహ్యంగానూ, అతి దరిద్రపు వాసనేస్తూనూ వుంటాయి.

రామిగాడి గుడిసె కూడా అలానే వుంటుంది. రామిగాడి భార్యకూడా- దాని పేరు సీతమ్మకాదు- రాములమ్మ. అలాగే వుంటుంది. దానికి యెక్కువగా ఆకలేస్తూ వుంటుంది. ఎప్పుడూ రోగాలొస్తుంటాయి.

రాములమ్మకి ఆవేళకూడా ఆకలేస్తోంది. అందుకుతోడు అయిదు రోజుల్నించీ జ్వర మొస్తోంది. ఆకల్తోనూ, అయిదు రోజుల్నించీ తగ్గని జ్వరంతోనూ, గుడిసెలో ఓ మూల గోనెగుడ్డ పరుచుకుని, పాతచీర పైన కప్పుకుని, మూలుగుతూ పడుకుంది.

---

## మనోహర్మ్యం

మనోహర్మ్యంలో మందిరా లనేకం
కొన్ని అలంకార సుశోభితాలు,
కొన్ని ధూళి ధూసరితాలు,
కొన్ని కస్తూరి కాగరు పరిమళ
భరితాలు,
కొన్ని దుస్సహ దుర్గంధ
భూయిష్టాలు.
కొన్ని సువిశాలాలు,
కొన్ని అత్యంత సంకుచితాలు.

రమ్యమైన వాకిళ్ళు,
అరణ్యాల్లాంటి లోగిళ్ళు,
జీబూతాల్లాంటి ముంగిళ్ళు,
పెనుభూతాల్లాంటి పెరళ్ళు,
ఇల్లంతా యధేచ్ఛగా
కలయ దిరగవచ్చు.

కాని

ఏదో ఒక గదిలో....
ఎదలో శూలానికి మూలమో,
మదిలో మచ్చకు అద్దమో,
గుప్తాగారంలో అస్తిపంజరమో
సుప్త భుజంగమో,
సాకారమో, నిరాకారమో....

ఒక భయంకర రక్షోశక్తి
దాగివున్నది జాగ్రత్త !
ఆ గది గుర్తుంచుకో;
ఆ తలుపులు తెరువకు.

—పి. జి. రామారావు

# ది రేప్

## (ఎ త్రీ ఇన్ వన్ స్టోరీ)

ఓ. వెంకట్రామయ్య



రాములమ్మకి యిద్దరు పిల్లలున్నారు. వాళ్ళకికూడా యెప్పుడూ ఆకలేస్తూంటుంది. అయితే- అదృష్టవశాత్తూ రోజూ రోగాలు మటుకు రావు- వాళ్ళిద్దరూ కూడా ఆకలేస్తే ఏడిచేంత పసివాళ్ళు. అంచేత - ఆకలేసినందుకు ఏడ్చి, ఏడ్చినందుకు అమ్మచేత దెబ్బలు తిని. అంతకు ముందే పడుకున్నారు; నిద్రపోతున్నారు.

రాములమ్మ కూడా పడుకుంది గాని, నిద్ర రావటం లేదు. రాత్రి పదకొండయింది.

గుడిసె బయట రిక్షా ఆగింది. గుడిసె గుమ్మానికున్న రేకు తలుపు కిరకిరలాడింది. రామిగాడు తూలుతూ,తడబడ్తూ, తడుముకుంటూ లోపలి కొచ్చాడు.

"వొచ్చావా మామా, బన్ను రొట్టె తెచ్చావా" అని నీరసంగా అడిగింది రాములమ్మ. "నోరుమ్మయ్ః ఎప్పుడూ ఆకలే ఎదవ లంజకి....." అన్నాడు రామిగాడు. రాములమ్మ నోరు మూసింది.

రామిగాడు గుడిసె లోపలికీ, బయటకీ కాసేపు తిరిగాడు. బయటికెళ్ళినప్పుడు ఏవో పదాలు పాడాడు. లోపలున్నపుడు ఏదో గొణిగాడు; ఎవరినో బూతులు తిట్టాడు. బుడ్డి దీపం వత్తి పెంచాడు. బీడీ వెలిగించుకున్నాడు. కాండ్రించి వుమ్మేశాడు. బీడీ ఆర్పేశాడు. దీపం దానంతట అదే ఆరిపోయింది.

రామిగాడు రాములమ్మ పక్కలో చేరాడు. ఆమె మీద కాలేశాడు. ఒక చేత్తో గట్టిగా ఆమె భుజం పట్టుకున్నాడు. "వొద్దు మామా....నాకు జ్వరం తగ్గలేదు....ఆకలేత్తాంది....వొళ్ళు వచ్చిపుండల్లే వుంది....వొద్దు మామా....నీకు దణ్ణం పెడతా....నా మాటిను మామా...."అంది రాములమ్మ.

రామిగాడు ఆమె మాట విన్లేదు.

*　　*　　*

భారత రాష్ట్రపతి అధికారాలేమిటీ అనడిగితే ఖచ్చితంగా చెప్పలేడుగాని, భారతస్త్రీ భర్తకుండే హక్కుల గురించీ, అధికారాల గురించీ మటుకు బాబూరావుకి బాగా తెలుసు. ఆ హక్కులూ, అధికారాలూ యెప్పుడు యేవిధంగా వినియోగించుకోవాలోకూడా అతనికి తెలుసు.

అందుకే "ఈ నెల యింకో యాభయి రూపాయ లెక్కువ ఇవ్వండి...." అని అడిగినందుగ్గాను భార్య చెంపమీద చాచి కొట్టాడు. కొట్టి "ఫస్టు తారీకొస్తే చాలు.. ఇదో న్యూసెన్సయిపోయింది.... ప్రతి నెలా యాభయివ్వు. వందివ్వు అంటే ఎక్కణ్ణించి వస్తయ్యనుకున్నావ్ః నీకాబు

సొమ్మేమన్నా ఇక్కడ దాచిపెటావా? నేను ఆఫీసులో అడ్డమైన చాకిరి చేసితెసుంటే.. నీకు చీరలకి షోకులకీ తక్కువైందా...." అంటూ తిట్టాడు.

భార్య ఏదన్నా కోరినప్పుడు, అది తీర్చడం కష్టమైనప్పుడు అలా అడగ్గానే టపటపా రెండు వాయించాలని. ఆ పైన వీలయినంత సేపు గుక్క తిప్పుకోకుండా చివాట్లు పెట్టాలనీ. ఆ విధంగా చేస్తే తప్ప ఆడవాళ్ళు మగాళ్ళని బతక నివ్వరని బాబూరావ్ నమ్మకం. తాను నమ్మిన ఈ సిద్ధాంతాన్ని స్వయంగా ఆచరించడమే కాక తన మిత్రులకి కూడా కొందరికి బోధించి అంత గొప్ప సలహా యిచ్చినందుకు వారి వద్ద అభినందనలు కూడా అందుకున్నాడు. "డొమెసిక్ ప్రాబ్లమ్స్ బాగా సాల్వ్ చేసాడు బాబూరావ్-" అన్న కీర్తి కూడా గడించాడు.

తను కొట్టినపుడూ, తిట్టినపుడూ ఏవిధంగా నడుచుకోవాలో కూడా లోగడ అనేక మార్లు భార్యకి బోధించి వున్నాడు బాబూరావ్. అందుకే ఆ ఇల్లాలు- ఆ అమ్మాయి పేరు సావిత్రి. ఈ నెల యాభై రూపాయలు ఎక్కువిమ్మని అడిగినందుకు భర్త చెంప పగలగొట్టినా, చటుక్కున వెనక్కి తిరిగి పమిట చెంగు నోట్లో కుక్కుకుని అవతలకి వెళ్ళిపోయింది గాని ఏమీ అన్లేదు ఎదురు చెప్పలేదు.

ఆడది ఎప్పుడూ కళ కళ లాడుతూ వుండాలనీ. మొగుడి ముందు ఎప్పుడూ ఏడుపు మొహంతో వుండకూడదనీ. ఏడవ కూడదనీ కూడా బాబూరావ్ తన భార్యకి బోధించాడు. అందుకే సావిత్రి వంటింట్లోకి వెళ్ళి, వో మూల గోడ కానుకుని కూర్చొని, ఆమె చప్పుడు కాకుండా ఏడ్చిందిగాని, భర్త ముందు ఏడవలేదు. తను యాభై రూపాయ లెక్కువగా అడిగింది. ఈ నెల నించీ ఇంటి అద్దె పెరగటం చేతా, కిరసనాయిలూ. పంచదారా [illegible]టుగా కొనాల్సి రావటం చేతా, పా[illegible]టకు పాలు ఎక్కువ కొంటున్నందువలాగాని, తన చీర కోసమూ షోకుల కోసమూ కానికూడా ఆమె భర్తకి చెప్పలేక పోయింది. చెప్పినా ఇంటి ఖర్చు ఎలా తగ్గించాలో హితబోధలూ మరికొన్ని చివాట్లూ తప్ప మరేమీ లాభం వుండదని ఆమెకే తెలుసు.

పెళ్ళాన్ని చెంప పగలగొట్టం తర్వాత బాబూరావ్ స్నానం చేసి ముస్తాబై, బయటికి వెళ్ళి, బలాదూరు తిరిగి, రాత్రి పదింటికి ఇంటికి చేరాడు. వారపత్రికలో సీరియల్ నవల చదువుకుంటూ, అప్పటిదాకా అతని కోసం ఎదురు చూస్తూ కూర్చున్న సావిత్రి- అతను రాగానే లేచివెళ్ళి భోజనం వడ్డించింది. బాబూరావ్ బట్టలు మార్చుకుని, లుంగీ కట్టుకుని, కాళ్ళు కడుక్కొచ్చి కూర్చున్నాడు. ఇద్దరూ కలిసే తిన్నారు. కాని - ఇద్దరూ ఏమీ మాట్లాడలేదు. భార్యని తిట్టం తర్వాతా కొట్టం తర్వాతా అంత త్వరగా మెత్తపడ కూడదని, కొంత సేపు ఆ "టెంపో" "మెయింటైన్" చెయ్యాలని కూడా బాబూరావ్ నమ్మకం. అందుకే కూర మారు వడ్డించమనీ, పెరుగు ఇంకాస వెయ్యమని చేతో సైగలు చేశాడుగాని. పెళ్ళాంతో మాట్లాడలేదు.

భోజనం తిని, త్రేన్చుకుంటూ పడక గదిలోకొచ్చి. వో గుప్పెడు వక్కపొడి నోటి నిండా పోసుకుని నములుతూ. సిగరెట్ వెలిగించుకుని, దిండు పైకి లాగి, గోడకి తలానించి. మంచం మీద వోరగా పడుకుని సినిమా పత్రికలో బొమ్మలు చూస్తున్నాడు బాబూరావ్.

సావిత్రి వంటిల్లు అన్నీ సర్దివచ్చి చాపమీద పిల్లల పక్కన అటు తిరిగి పడుకుంది. సినిమా బొమ్మలన్నీ రెండుసార్లూ మూడుసార్లూ, ఆడబొమ్మలయితే అయిదారుసార్లూ చూశాక బాబూరావ్ లేచి పత్రిక పక్కన పడేసి. లైట్ తీసేసి మళ్ళీ వచ్చి మంచమ్మీద పడుకున్నాడు.

అయిదు నిమిషాల తర్వాత ఒకసారి దగిన తర్వాత, ఒకసారి సకిలించిన తర్వాత, అటూ యిటూ ఒకసారి దొర్లిన తర్వాత, మంచమ్మీద ఆ చివరికంటా జరిగి, కాలుకిందికి జారవిచ్చి, చాపమీద అటుతిరిగి పడుకున్న సావిత్రి తొడల మీద మెల్లిగా బొటనవేలితో గిచ్చాడు. సావిత్రి కదల్లేదు ఆ తర్వాత మెల్లగా రెండు మూడు సార్లు కాలితో తన్నాడు. సావిత్రి పిలుపుకి ఇంకాస దగ్గరగా జరిగింది. బాబూరావ్ చటుక్కున మంచమ్మీంచి లేచి. సావిత్రి [illegible] ఒక్క లాగు పైకిలాగి [illegible] ఆమె నడుము పట్టుకుని. ఒక్క వూపుతో మంచం [illegible] తోశాడు.

కార్టూన్ కవిత :


## ఉల్లి కల్లోలం


నిశ్చలమై - నిర్మలమైన
నీ మనో కాసారంలోకి



గజగమన
స్నానానికి ప్రవేశించిందా ?
గోవిందో....గోవిందా !!

—నీలాప్రియ





ఆ తర్వాత కొంత సేపటికి, మళ్ళీ చాపమీద పిల్లల పక్కకెళ్ళి పడుకున్నాక బాబూరావ్ గురకలు వినిపిస్తున్నా కూడా సావిత్రికి బిగ్గరగా ఏడవటానికి భయమేసింది.

*   *   *

"కెన్ యూ బిలీవ్ దటయామ్ ఫార్టీ ఫైవ్ !" అన్నాడు పార్థసారథి.

కళ్ళు పెద్దవి చేసి, ఆశ్చర్యంగా అతని వేపు చూస్తూ- "ఈజిట్ సో?... బట్ యూ లుక్ సో యంగ్ ....!" అంది ఆ అమ్మాయి అతి తియ్యగా.

ఆ అమ్మాయి అసలు పేరు అరుణ. కాని అవసరాన్ని బట్టీ- అవతలి వ్యక్తిని బట్టీ-బేబీ అనీ, రాణి అనీ, రోజీ అనీ ఒక్కోసారీ ఒక్కో పేరు చెపూ వుంటుంది.

"అయామ్ వోన్లీ ట్వెంటీవన్...." అంది అరుణ ఈసారి మరింత తియ్యగా. "ఐనో బేబీ.... ఐనో ... నువ్వు చెప్పకపోయినా నీ బాడీ చూసే ఎవరికయినా తెలుస్తుంది ఆ సంగతి...." అని కొంటెగా నవ్వాడు పార్థసారథి.

అరుణ కాస్త సిగ్గుపడింది. సిగ్గుసిగ్గుగా అతని వంక చూస్తూ చిరునవ్వు నవ్వింది.

పార్థసారథి అలాంటి హోటళ్ళు అయిదారు కొనగలిగినంత డబ్బుంది గాని, ఆ రాత్రికి మాత్రం ఆ హోటల్లో ఒక ఎయిర్ కండిషన్డ్ గదినీ, ఆ అమ్మాయినీ కొన్నాడు. అటు పైన ఒక విదేశీ విస్కీ సీసా కొన్నాడు; విదేశానికే సిగరెట్లు కొన్నాడు; ఈ దేశానికే జీడిపప్పు తెప్పించాడు; కోళ్ళూ, రొయ్యలూ ఈ దేశానికే గాని- చైనీస్ రెస్టారెంట్ నుంచి తెప్పించాడు తను కొన్నవన్నీ తింటూ తాగుతూ అనుభవిస్తూ—

అతనా వేళ చాలా ఆనందంగా వున్నాడు.

"లెట్స్ హేవ్ వన్ మోర్ రౌండ్ బేబీ " అన్నాడు. విస్కీ రెండు గ్లాసులోకి పోస్తూ.

"అమ్మో....వద్దండీ....అప్పుడే పన్నెండు దాటింది....ఇక నే వెళ్ళాలి ... ప్లీజ్ ..." అంది అరుణ

ఇప్పటిదాకా ఆమె మొహాన వెలిగిన చిరునవ్వు ఇప్పుడు లేదు మాటలో ఇందాకటి తియ్యదనం లేదు. భయం వుంది, జాలి వుంది. ప్రార్థన వుంది.

కాని పార్థసారధికి అవేమి తెలియటం లేదు అతనికి విదేశీ విస్కీ మత్తటి రుచి తెలుస్తోంది, జింజెర్ చికెన్ ఘాటు తెలుస్తోంది. అతని కళ్ళకు ఎదురుగా కూర్చున్న ఆ పిల్ల అందం ఇందాకటి కంటే ఎక్కువగా తెలుస్తోంది. అందుకే, "నో బేబీ, నో .. యూ మస్ట్ హేవిట్... యూ మస్ట్ హేవిట్ వన్స్ ఎగెన్ ...." అంటూ ఆమె చేతికి విస్కీ గ్లాసు అందించాడు

బలవంతాన తాగుతున్న విస్కీ అరుణ గొంతులో మండుతోంది: కడుపులో దేవుతోంది: ఆకలిగావున్నా కోడి ముక్క గొంతు దిగటం లేదు. అతి చల్లగా వున్న ఆ ఎయిర్ కండిషన్డ్ గదిలో కూడా ఆమె మొహాన చిరుచెమటలు కమ్ముకుంటున్నాయి: పసితనంలోనే పోలియో వచ్చి కాళ్ళు, రెండూ చచ్చుపడి మెలికలు తిరిగిపోయిన అయిదేళ్ళకొడుక్కి ముసలి అత్త అన్నం పెట్టిందో, లేదోనని ఆమెకి అనుమానంగా వుంది. అన్నం లేకపోయినా సరే, నిద్ర మాత్రలు లేందే బతకలేని మామగారు, ఇంకా తనకోసం ఎదురు చూస్తూ ముందు వాకిట్లోనే కూర్చున్నాడేమోనని ఆందోళనగా వుంది పగలంతా ఫాక్టరీలో పనిచేసి, సగం రాత్రిదాకా సారాదుకాణాల్లో గడిపి వచ్చే భర్త, ఇవ్వాళ ముందుగానే వస్తాడేమోనని భయంగా వుంది

పార్థసారథి గ్లాసులో మిగిలిన కాస్త విస్కీ గటగటా తాగేశాడు. లేచి, తనకెదురుగా కూర్చున్న అరుణ దగ్గర కొచ్చాడు. ఆమె చేతిలో వున్న గ్లాసుతీసుకుని పక్కన పెట్టాడు. రెండు భుజాలూ పట్టుకుని మెల్లగా లేపి, దగ్గరగా లాక్కుని బలంగా కౌగిలించుకున్నాడు. అతని చేతులు పాముల్లా ఆమె శరీరమంతా పాకుతున్నాయి.

అరుణ మెల్లగా అతని కౌగిట్లోంచి తప్పుకోడానికి ప్రయత్నిస్తూ- "....మళ్ళీ వద్దు సార్ .... ఇక నే వెళ్ళాలి సార్ ... ముందే చెప్పాగా సార్ పన్నెండింటికి వెళ్ళాలని నాకు లేటయిపోతుంది సార్- ... "- అంది అతి మెల్లగా, అతి దీనంగా.

పార్థసారథికి కోపమొచ్చింది "యూ బిచ్ ..." అని అరిచాడు. ఆ తర్వాత అసహ్యంగా తెలుగులోనే తిట్టాడు. కోపమొచ్చినపుడు తెలుగు మాట్లాడినంత ధారాళంగా ఇంగ్లీషు మాట్లాడలేడతను అందుచేత ధారాళంగా కొంతసేపు తిట్టి, ఆ తర్వాత "నేను నిన్ను ఈ రాత్రికి కొన్నాను.... నేనుండమన్నంత సేపు వుండాల్సిందే.... నేను పడుకోమన్నన్నిసార్లు పడుకోవలసిందే...." అన్నాడు. అని, మళ్ళీ మూడోసారి ఆమె చీర కుచ్చెళ్ళు వూడలాగాడు. లంగాబొందు పటపటా తెంపి పారేశాడు.

అప్పటికి ఇంకా ఏదో వేడుకుంటున్న అరుణ మాటలు అతనికి వినిపించలేదు. ఆమె కళ్ళలో పల్చగా కమ్మిన కన్నీటి పొరలు విదేశీ మద్యపు మత్తుతో మూతలు పడుతున్న అతని కళ్ళకి కనిపించలేదు.

*   *   *

అయ్యా! ఇవంటీ నేను చెప్పదల్చుకున్న కథలు. తీరా చదివాక, ఇవసలు కథలు కావని, సెక్స్ కథలు అసలే కావని, ఇంతకంటే పత్రికల్లో వచ్చే మానభంగాల వార్తలే మా కెక్కువ ఆసక్తికరంగా వున్నాయనీ మీరనుకున్నా, ఇవి చదివి మీలో కొందరు భుజాలు తడుముకున్నా, అనుమానించినా, ఆగ్రహించినా నేనందుకు బాధ్యుణ్ణి కాను.